## ఎంపికైన కేజీబీవీ నుండి ఆరవ తరగతి కోసం ఈనెల 12వ తేదీన ప్రవేశ పరీక్ష

**వికారాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి ఎండి అబ్దుల్ ఘని**



**వికారాబాద్ రాజముద్ర న్యూస్:** వికారాబాద్ జిల్లా పరిధిలోని మూడు కేజీబీవీ కేంద్రాలలో కేజీబీవీ వికారాబాద్, కేజీబీవీ దోమ, కేజీబీవీ కోడంగల్ యంగ్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎక్సెలెన్స్ లలో ఈనెల 12 తేదీన 6వ తరగతికి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎండి. అబ్దుల్ ఘని తెలిపారు. పరీక్ష ఉదయం 11.00 గంటల నుండి 1.00 గంట వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఆరవ తరగతి నుండే జాతీయస్థాయిలో జేఈఈ, నీట్, క్లాట్ వంటి పోటీ పరీక్షలకు అనుగుణంగా బోధన చేయబడునని తెలిపారు. మంచి హాస్టల్ వసతి, నాణ్యమైన బోధన, ఎస్ఓపి ద్వారా రుచికరమైన భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలు, వర్క్ బుక్స్, ఏకరూప దుస్తులు, దుప్పట్లు తదితర వస్తువులు అందించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు అకాడమిక్ తో పాటు యోగ, కరాటే, ఆటలు, ప్రయోగశాలలు, గ్రంథాలయము, ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా, టైలరింగ్, కంప్యూటర్ బోధన, ఆర్ట్ క్రాఫ్ట్ వంటి కోర్సులు విద్యార్థులకు అందించబడును, పూర్తి వివరాలకు సంబంధిత కేజీబీవీ కేంద్రాలలో స్పెషలాఫీసర్లను సంప్రదించలని డిఈఓ ఎం.డి.అబ్దుల్ ఘని తెలియజేయడం జరిగింది.

## ఐదు నెలలుగా నిలిచిపోయిన రేషన్ కార్డుల జారీ





**హైదరాబాద్ రాజముద్ర న్యూస్:** హైదరాబాద్ జిల్లా పరిధిలో కొత్త రేషన్ కార్డు జారీ కోసం దరస దరఖాస్తు చేసుకున్న వారికి నిరాశ మిగిలింది గత ఐదు నెలలుగా జిల్లా పరిధిలోని అన్ని సర్కిల్ లో కొత్త రేషన్ కార్డుల జాతి ప్రక్రియ పూర్తిగా నిలిచిపోవడంతో కార్డుల కోసం దరఖాస్తుదారులు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే విషయం తెలిసినదే ఆన్లైన్లో పెద్ద సంఖ్యలో జిల్లాలోని నిరుపేదలు దరఖాస్తు చేసుకున్నారు. అయితే గత ఐదు నెలలుగా వారికి రేషన్ కార్డులు జారీ ప్రక్రియ పౌరసరఫరాల శాఖ అధికారులు నిలిపివేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. కొత్త రేషన్ కార్డులు ఎప్పుడు జారీ అవుతాయో తెలియక జిల్లా పరిధిలోని అన్ని సర్కిల్లో పేదలు కార్డుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది దీంతో రేషన్ కార్డు లేక నిత్యవసరాలు అందక పేద ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో రేషన్ కార్డులు జారీ ప్రక్రియను చేపట్టాలని ప్రజల కోరుకుంటున్నారు

## కాంగ్రెస్ పార్టీలో చేరిన ఉప్పల్వాయి గ్రామ సర్పంచ్



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** ఎల్లారెడ్డి నియోజకవర్గం రామారెడ్డి మండలం ఉప్పల్వాయి గ్రామ సర్పంచ్ శివరాణి రాజేందర్ ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది ఎమ్మెల్యే వారికీ కాంగ్రెస్ పార్టీ కండువ కప్పి కాంగ్రెస్ పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే మదన్ మోహన్ నాయకత్వంలో ఎల్లారెడ్డి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుండగా, ఉపాల్వాయి గ్రామం కూడా అభివృద్ధి చెందుతున్నదని అన్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, తాగునీటి సౌకర్యాలు, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, గృహ జ్యోతి పథకం వంటి అనేక ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు అందాయని తెలిపారు. గ్రామ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్ నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధిలో భాగస్వాములు కావాలనే సంకల్పంతో తాము సమిష్టిగా కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వెల్లడించారు.

## రోడ్డుని తొవ్వారు - రోడ్డు వేయడం మరిచారు



**రామంతపూర్ రాజముద్ర న్యూస్:** రామంతపూర్ పరిధిలోని వివేక్ నగర్ స్ట్రీట్ నెంబర్ 8 లోగల రోడ్డు మర మత్తుల లో భాగంగా రోడ్డుని తోవ్వి దాదాపు నెల రోజులు గడుస్తున్నా అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. రోడ్డు కాంట్రాక్టర్ ని అడిగితే ఒకటి రెండు రోజులలో వేస్తామని చెప్పి దాదాపు నెల గడుస్తున్నా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు దీనితో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని రోడ్డుని త్వరగా వేయించాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు

# చావు లేని పాట – ప్రజా కళాకారుడు కామ్రేడ్ అరుణోదయ నాగన్నకు అక్షర నివాళి



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** ఒక గొంతు మూగబోయింది. కానీ ఆ గొంతు రగిలించిన చైతన్యం, ఆ గొంతు వినిపించిన ఆక్రోశం, ఆ గొంతు పంచిన ధైర్యం మాత్రం ఈ నేల మీద, ఈ ప్రజల గుండెల్లో ఎప్పటికీ బతికే ఉంటుంది. ఆ గొంతు పేరు కామ్రేడ్ నాగన్న. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం రాజారం గ్రామంలో ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టి, 1970 దశకంలో విప్లవ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న రోజుల్లో సీపీఐ ఎంఎల్ పార్టీలో చేరిన నాగన్న, 50 ఏళ్లకు పైగా నిరంతరం పార్టీ కోసం, ప్రజల కోసం బతికిన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అందించిన విప్లవ సూరీడు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పూర్తికాలం కార్యకర్త.

**"కల కోసం కాదు, కల ప్రజల కోసం" – అదే ఆయన జీవన నినాదం**

నాగన్నకు పాటంటే కేవలం రాగం కాదు, అది ఒక రణన్నినాదం. కవిత్వం అంటే కేవలం అక్షరాల అల్లిక కాదు, అది అణగారిన ప్రజల ఆవేదనకు అక్షర రూపం. "నేను పాడేది నా కోసం కాదు, నా కడుపు కోసం కాదు... కాలుతున్న కడుపుల కోసం, కన్నీళ్లు కారుస్తున్న కళ్ల కోసం" అనేవాడు. డప్పు భుజాన వేసుకుని ఊరూరా తిరుగుతూ, గొంతెత్తి పాడిన ప్రతి పాట వెనుక ఒక పోరాటం ఉండేది. ఒక ఆశ ఉండేది. ఒక ఆగ్రహం ఉండేది. 1970–80ల ఎమర్జెన్సీ కాలంలో, నక్సల్బరీ స్ఫూర్తి గ్రామాలకు పాకుతున్న సమయంలో నాగన్న గొంతు ఒక ఆయుధమైంది. ఎర్రటి ఎండలో నెర్రెలు వారిన భూముల మధ్య నిలబడి పాడాడు. వాగులు వంకలు దాటి, గొల్లగూడేలు, మాదిగ పల్లెలు, లంబాడా తండాలు తిరుగుతూ ప్రజల్లోకి వెళ్లాడు. భూస్వాముల గుండెల్లో దడ పుట్టించాడు. పాలకుల నిద్ర చెడగొట్టాడు. కానీ పేదవాడి గుండెకు మాత్రం కొండంత ధైర్యాన్నిచ్చాడు.

**పూర్తికాలం కార్యకర్త – పార్టీకి, ప్రజలకు వారధి**

నాగన్న జీవితం వ్యక్తిగతం కాదు, అది పూర్తిగా సామాజికం. 50 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో ఆయన కుటుంబాన్ని, పిల్లలను కూడా ఉద్యమానికి అంకితం చేశాడు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ సిద్ధాంతాన్ని నమ్మి, ఆచరించి, ప్రచారం చేసిన నిబద్ధత కలిగిన కార్యకర్త ఆయన. పదవులు, పేరు ప్రతిష్ఠల కోసం ఎప్పుడూ ఆరాటపడలేదు. పార్టీ చెప్పిన పని, ప్రజలకు అవసరమైన పని – ఇదే ఆయనకు పరమావధి.ఖమ్మం, భద్రాద్రి, వరంగల్ జిల్లాల్లో జరిగిన భూ పోరాటాల్లో నాగన్న పాత్ర మరువలేనిది. "భూమి దున్నేవాడిదే" అంటూ వేలాది ఎకరాల భూములను పేదలకు పంచిన ఉద్యమాల్లో ఆయన పాట ఒక ఉత్తేజం. కూలీ రేట్ల కోసం జరిగిన సమ్మెల్లో, గీత కార్మికుల ఉద్యమాల్లో, బొగ్గు గని కార్మికుల పోరాటాల్లో ఆయన గొంతెత్తాడు. దళితులపై, ఆదివాసీలపై జరిగిన దాడులను, కరకగూడెం, లక్ష్మీపురం ఘటనలను తన పాట ద్వారా ఎండగట్టాడు. మహిళలపై హింసను, వరకట్న దురాచారాన్ని ప్రశ్నించాడు. ప్రభుత్వ విధానాల్లోని డొల్లతనాన్ని, ప్రపంచీకరణ దుష్ఫలితాలను అరుణోదయ వీధి నాటకాల ద్వారా, బుర్రకథల ద్వారా ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాడు.

**అరుణోదయ అంటే నాగన్న – నాగన్న అంటే అరుణోదయ**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అరుణోదయ కార్యక్రమం అంటే చాలు, అందరికీ గుర్తొచ్చేది నాగన్న గొంతు. 80వ దశకంలో "తుపాకీ గొట్టం నుంచే రాజ్యాధికారం పుడుతుంది" అనే నినాదం మార్మోగుతున్న రోజుల్లో, నాగన్న పాట దాని సాంస్కృతిక రూపమైంది. ఆయన డప్పు దెబ్బకు ఊరు ఊరంతా కదిలేది. పిల్లలు, పిల్లగాళ్లు, ముసలీ ముతకా అందరూ ఆయన చుట్టూ చేరేవారు."మా భూముల్లో మేమే బానిసలమా" పాట పాడితే రైతులు కన్నీళ్లు పెట్టుకునేవారు. "అమరుల త్యాగాలకు వందనం" అంటూ అమరవీరుల సంస్మరణ సభల్లో పాడితే, యువకుల రక్తం మరిగేది. ఆయన పాటలో ఉన్న సహజత్వం, యాస, ఆయన మాటలో ఉన్న నిజాయితీ ప్రజలను కట్టిపడేసేది. "అమ్మా అన్నం పెట్టు" అని ఏ గూడెంలో నిలబడినా ఆ ఇల్లు తమ ఇల్లుగా భావించేవారు. అందుకే నాగన్నకు శత్రువులు లేరు. ఉంటే గింటే అది దోపిడీ వ్యవస్థే.

**జైలు జీవితం – ఉద్యమ పాఠశాల**

నాగన్న జీవితంలో జైలు జీవితం ఒక భాగం. అనేకసార్లు అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపినా, ఆయన కుంగిపోలేదు. జైలును కూడా ఒక ఉద్యమ పాఠశాలగా మార్చుకున్నాడు. తోటి ఖైదీలకు పాటలు నేర్పాడు, చైతన్యం నింపాడు. "జైలు గోడల మధ్య నా పాట ఆగదురా" అనేవాడు. బయటకు వచ్చిన మరుక్షణమే మళ్లీ డప్పు భుజాన వేసుకుని బయలుదేరేవాడు. ఆయనకు అలసట తెలియదు, విశ్రాంతి తెలియదు.

**మరణం లేని మనిషి – తరగని స్ఫూర్తి**

ఈరోజు నాగన్న భౌతికంగా మన మధ్య లేడు. ఈ వార్త జీర్ణించుకోలేనిది. కానీ చావు అనేది శరీరానికే గానీ, ఆశయానికి కాదు. నాగన్న వదిలి వెళ్లింది కేవలం జ్ఞాపకాలు కాదు, ఒక పెద్ద బాధ్యత. ఆయన ఆశించిన దోపిడీ లేని సమసమాజం కోసం పోరాడే బాధ్యత.ఈరోజు తెలంగాణ పల్లెల్లో భూ సమస్య ఉన్నా, పోడు భూముల సమస్య రగులుతున్నా, కార్మికుడికి కనీస వేతనం అందకపోయినా – అక్కడ నాగన్న పాట అవసరం ఉంది. ప్రతి భూ పోరాటంలో, ప్రతి కార్మిక సమ్మెలో, ప్రతి విద్యార్థి ఉద్యమంలో నాగన్న పాట వినిపిస్తూనే ఉంటుంది. ఏ గ్రామంలో అయినా దోపిడీకి వ్యతిరేకంగా ఒక గొంతు లేచిందంటే అది నాగన్న వారసత్వమే.

**- ఖమ్మం రాజముద్ర రిపోర్టర్ ఎల్లుట్ల సైదులు**

**ఇది ముగింపు కాదు, ఆరంభం**

కామ్రేడ్ నాగన్నకు కన్నీటి వీడ్కోలు పలకడం కాదు, మనం చేయాల్సింది. ఆయన ఆశయ సాధన కోసం రెట్టించిన ఉత్సాహంతో పనిచేయడం. ఆయన పట్టిన డప్పును మన భుజాన వేసుకోవడం. ఆయన ఆపిన చోట నుంచి పాటను మళ్లీ అందుకోవడం. కొత్త తరం కళాకారులను తయారు చేయడం.ప్రజా కళాకారులు చనిపోరు. వారు పాటై ప్రజల గుండెల్లో, పోరాటమై ప్రజల నినాదంలో బతికే ఉంటారు. నాగన్న అలాంటి చావులేని పాట. అరుణోదయానికే అరుణోదయం అయిన వెలుగు దివ్వె. రాజారాం మట్టిలో పుట్టి, విప్లవ ఆకాశమంత ఎదిగిన ధీశాలి. బతికుండగానే చచ్చినవారు కోట్లాది మంది, చచ్చి కూడా బతికున్నవారు అరుదుగా కొందరు. ఆ అరుదైన కొందరిలో నీవు మొదటివాడివి కామ్రేడ్.విప్లవ జోహార్లు కామ్రేడ్ అరుణోదయ నాగన్నకు! విప్లవ జోహార్లు! విప్లవ జోహార్లు! నీ త్యాగం వృధా కాదు – నీ ఆశయం సాధిస్తాం!




# రైతులకు సువర్ణావకాశం

## ఉచితంగా 'పంట కుంటల' ఏర్పాటు.. జూలై 7 లోపు దరఖాస్తు చేసుకోండి!

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడంతో పాటు, భూగర్భ జలాల పెంపకానికి ప్రభుత్వం సరికొత్త అవకాశాన్ని కల్పిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు ఉచితంగా పంట కుంటల ను ఏర్పాటు చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. వర్షపు నీటిని వృథా చేయకుండా నిల్వ చేసుకోవడం ద్వారా పంటలకు సాగునీరు అందించడంతో పాటు, రైతులు అదనపు ఆదాయం పొందేలా ఈ పథకాన్ని రూపకల్పన చేశారు.

**రూ.96,000 వరకు ప్రభుత్వ ఆర్థిక సహాయం**

ఈ పథకం కింద ఎంపికైన రైతులకు ఉచితంగా పంట కుంటను తవ్వుకోవడానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం గరిష్టంగా రూ.96,000 వరకు ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందించనుంది. ఉపాధి హామీ పథకం అనుసంధానంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. భూమి వివరాలు: దరఖాస్తు చేసుకునే రైతుకు 5 ఎకరాల లోపు వ్యవసాయ భూమి ఉండాలి. చిన్న, సన్నకారు రైతులకు ఇందులో ప్రాధాన్యత ఉంటుంది. జాబ్ కార్డు: రైతు తప్పనిసరిగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు కలిగి ఉండాలి.



**పంట కుంటల వల్ల కలిగే బహుళ ప్రయోజనాలు:**

- సాగునీటి వసతి: వర్షపు నీటిని నిల్వ చేసుకుని, పంటలు ఎండిపోయే దశలో అత్యవసరంగా సాగునీటిని అందించుకోవచ్చు.
- చేపల పెంపకం: కుంటలలో చేపల పెంపకం చేపట్టడం ద్వారా రైతులు ప్రత్యామ్నాయంగా అదనపు ఆదాయాన్ని ఆర్జించవచ్చు.
- పశుగ్రాసం: కుంటల నీటి ఆధారంగా 'అజోలా' (పాచి మేత) సాగు చేసి, పశువులకు పోషక విలువలు గల మేతను అందించవచ్చు.
- భూగర్భ జలాలు: ఈ కుంటల ద్వారా పరిసర ప్రాంతాల్లోని బోరు బావులు, బావులలో నీటి మట్టాలు గణనీయంగా పెరుగుతాయి.

**జూలై 7 ఆఖరి తేదీ.. వెంటనే సంప్రదించండి!**

ఈ ఉచిత పంట కుంటల పథకానికి అర్హులైన రైతులు ఈనెల జూలై 7వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఆసక్తి గల రైతులు వెంటనే తమ గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి లేదా ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ ను కలిసి దరఖాస్తు ఫారాలను సమర్పించాల్సిందిగా కోరారు. గడువు ముగిసిన తర్వాత వచ్చే దరఖాస్తులను పరిశీలించబోరని స్పష్టం చేశారు. నీటి నిల్వ—మీ భవిష్యత్తుకు భరోసా ఇచ్చే ఈ సువర్ణావకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు.

